సాక్షి
రాజన్న సిరిసిల్ల
మంగళవారం । 30 । జనవరి । 2024



పంచాయతీ సిబ్బందికి సన్మానం

చందుర్తి(వేములవాడ): మల్యాల గ్రామపంచాయతీ సిబ్బందిని సోమవారం సన్మానించారు. సర్పంచ్ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు.



పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్లటౌన్: ఈనెల 31న నిర్వహించే గద్దర్ విగ్రహావిష్కరణ సభ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. దోసల చంద్రం, మేకల కమలాకర్, పిట్ల రఘు ఉన్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం
31.0/18.0

ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నెల రోజులు కష్టపడితే మంచి ఫలితాలు



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ: నెల రోజులు కష్టపడితే మంచి ఫలితాలు వస్తాయని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు సోమవారం ఉచిత మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించి, వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అందుకోవాలని సూచించారు. ఇంటర్మీడియెట్ స్టేజీలోనే జాగ్రత్తలు పాటిస్తే బంగారు భవిష్యత్ సొంతం చేసుకోవచ్చన్నారు. ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్ రెడ్డి, కౌన్సిలర్ మహేశ్ పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేకు 16 ఫిర్యాదులు



సిరిసిల్లక్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతీ సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ డేకు 167 ఫిర్యాదులు అందినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో స్వీకరించిన ఫిర్యాదులను సంబంధిత స్టేషన్ అధికారులకు అందించి సత్వర న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

- ఉమెన్ హబ్ కో–ఆర్డినేటర్ రోజా



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): విద్యార్థులు మంచి మార్గంలో పయనిస్తూ.. చదువుపై దృష్టిపెట్టి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఉమెన్ హబ్ కో–ఆర్డినేటర్ రోజా కోరారు. ఎల్లారెడ్డిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం ఉమెన్ హబ్, బాలరక్షాభవన్, సఖీ, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. రోజా మాట్లాడుతూ విద్యార్థులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని, ఆరోగ్యంగా ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి పర్శరాములు, బాలరక్షాభవన్ అధికారి గౌతమి, సఖీ ఇన్‌చార్జి దీపిక పాల్గొన్నారు.

కార్మికులను శ్రమదోపిడీ చేయొద్దు

- సీఐటీయూ ఉపాధ్యక్షుడు రమేశ్



సిరిసిల్లటౌన్: అపెరల్ పార్కులోని కార్మికులను యాజమాన్యం శ్రమదోపిడీకి గురిచేస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మూశం రమేశ్ ఆరోపించారు. సిరిసిల్లలోని పార్టీ ఆఫీస్‌లో సోమవారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. గత రెండేళ్లుగా కార్మికులతో ఓవర్ డ్యూటీలు చేయిస్తున్నారని ఆరోపించారు. కార్మికుల హక్కులను కాలరాస్తే సహించబోమని హెచ్చరించారు. ఎల్లారెడ్డి, సంపత్, సురేష్ పాల్గొన్నారు.

సృజనాత్మకంగా ఆలోచించాలి



సిరిసిల్లకల్చరల్: విద్యార్థులు సృజనాత్మక ఆలోచన వైఖరి అలవరచుకోవాలని వక్తలు పేర్కొన్నారు. జిల్లాలోని ఎస్సీ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రీమెట్రిక్ విద్యార్థులకు ఎస్సీ సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ భవన్‌లో ప్రేరణ సదస్సు నిర్వహించారు. జిల్లా విద్యాధికారి రమేశ్, సైకాలజిస్టు పున్నం చందర్, సబ్జెక్టు నిపుణులు మాట్లాడారు. పాఠ్యాంశాల వారీగా బ్లూప్రింట్‌ను అనుసరించి చదువుకుంటే మంచి ఫలితాలు వస్తాయన్నారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి రాఘవేందర్, క్రీడల శాఖ అధికారి రాందాస్, మైనార్టీ అధికారి సర్వర్‌మియా, ఏఎస్‌డబ్ల్యూవో విజయలక్ష్మి, ఎండీ ఆజం పాల్గొన్నారు.

చేతిలో ‘గులాబీలు’

- కారు దిగుతున్న ప్రజాప్రతినిధులు
- నేడు సిరిసిల్ల, ముస్తాబాద్, ఎల్లారెడ్డిపేట, గంభీరావుపేటల్లో చేరికలు
- మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో కాంగ్రెస్‌లోకి..
- జిల్లాలో మారుతున్న సమీకరణాలు
- నామినేటెడ్ పదవులపై ఆశలు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. శాసనసభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ ఓటమి పాలవడం.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో గులాబీ నేతలు కారు దిగి హస్తం గూటికి చేరుతున్నారు. జిల్లాలో శాసనసభ ఎన్నికల్లో మిశ్రమ ఫలితాలు వచ్చాయి. వేములవాడలో కాంగ్రెస్ అభ్యర్థి ఆది శ్రీనివాస్ విజయం సాధించగా.. సిరిసిల్లలో సిట్టింగ్ ఎమ్మెల్యే కె.తారక రామారావు గెలిచారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆది శ్రీనివాస్ ప్రభుత్వ విప్ అయ్యారు. జిల్లాలో తాజాగా పలువురు బీఆర్‌ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామాలు చేశారు. కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధమైంది.

• నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన

జిల్లాలో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ మంగళవారం పర్యటించనున్నారు. ముస్తాబాద్, గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట, సిరిసిల్ల పట్టణంలో జరిగే కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డిలతో కలిసి పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లోని పలువురు ప్రజాప్రతినిధులు, మాజీ నాయకులు బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఈమేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

• నామినేటెడ్ పదవులపై ఆశలు

జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు నామినేటెడ్ పదవులపై ఆశలు పెట్టుకున్నారు. పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉన్న ఆ పార్టీ నేతలు నామినేటెడ్ పదవులు పొందాలని ఆశిస్తున్నారు. జిల్లాలో ముఖ్యమైన నామినేటెడ్ పదవులు ఎన్నో ఉన్నాయి. రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందిన పదవులు సైతం మన జిల్లాలోనే ఉండడం విశేషం. దశాబ్దకాలంగా వేములవాడ ఆలయ అభివృద్ధి కమిటీ నియామకానికి దూరంగా ఉంది. కాంగ్రెస్ అధికారంలో ఉండగా.. వేములవాడ ఆలయ అభివృద్ధి కమిటీని వేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పలువురు నాయకులకు కమిటీలో స్థానం కల్పించారు. వస్త్రోత్పత్తి రంగం సిరిసిల్లలో స్థిరపడి ఉండగా.. రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉన్న తెలంగాణ పవర్‌లూమ్ అండ్ టెక్స్‌టైల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీపీటీడీసీ), చేనేత డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లు ఉన్నాయి. జిల్లాలోని 13 మండలాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఉన్నాయి. ఒక్కో కమిటీలో చైర్మన్, వైస్‌చైర్మన్‌తో పాటు 10 మంది డైరెక్టర్లను నియమించే అవకాశం ఉంది. సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ప్రతిష్ఠాత్మకమైన జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ పదవి ఉంది. ఇవి కాకుండా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు ఉన్న అనేక కార్పొరేషన్లు, డైరెక్టర్ స్థానాలు ఉన్నాయి. ఇలా జిల్లాలోని నామినేటెడ్ పదవులపై పలువురు కాంగ్రెస్ నేతలు ఆసక్తిగా ఉన్నారు.

• స్థానిక సంస్థలపైనా గురి

సమీప భవిష్యత్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికలు, గ్రామసర్పంచ్ ఎన్నికలు ఉన్నాయి. కాంగ్రెస్‌లోని కొందరు నేతలు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుకుని జెడ్పీ చైర్‌పర్సన్, ఎంపీపీ, జెడ్పీటీసీ వంటి పదవులను దక్కించుకోవాలని భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అంగబలం, అర్థబలం అవసరం. ఎన్నికల్లో గెలుపోటములు దైవాధీనం కావడంతో ఆర్థికంగా అంతగా లేని కాంగ్రెస్ నేతలు సులభంగా నామినేటెడ్ పదవులు దక్కించుకోవాలని భావిస్తున్నారు. ఈనేపథ్యంలోనే పలువురు నేతలు కారు దిగి హస్తం గూటికి చేరేందుకు సిద్ధమయ్యారు.



బీఆర్‌ఎస్‌కు రాజీనామా ప్రకటిస్తున్న ముస్తాబాద్ జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఆ పార్టీ నాయకులు

అహంకారానికి నిరసనగానే..

- ముస్తాబాద్ జెడ్పీటీసీ గుండం నర్సయ్య
- పార్టీ సభ్యత్వానికి రాజీనామా
- నలుగురు సర్పంచ్‌లు, మాజీ జెడ్పీటీసీ సైతం

ముస్తాబాద్(సిరిసిల్ల): అణచివేత, అహంకారంపై నిరసనగా బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నామని ముస్తాబాద్ జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కలకొండ కిషన్‌రావు, మరో ముగ్గురు సర్పంచ్‌లు ప్రకటించారు. బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వానికి మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నట్లు పలువురు సీనియర్ నాయకులు సోమవారం ప్రకటించారు. ముస్తాబాద్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఐదేళ్లు ప్రజాప్రతినిధులుగా ఉన్నా మాజీ మంత్రి కేటీఆర్ ఏనాడు తమను పట్టించుకోలేదన్నారు. మండలంలో కొంతమంది బీఆర్‌ఎస్ నాయకులు తమను అణచివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను జెడ్పీటీసీగా పేదలకు ఎలాంటి పనులు చేయలేకపోయానని నర్సయ్య పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిషన్‌రావు మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని కేటీఆర్‌ను కలిసేందుకు ప్రగతిభవన్‌కు వెళ్తే కలవనీయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రిగా ఉన్న సమయంలో పట్టించుకోలేని కేటీఆర్.. నేడు సర్పంచ్‌ల బిల్లుల కోసం పోరాటం చేస్తామనడం హాస్యాస్పదమన్నారు. సర్పంచ్‌లుగా గెలిచాక తొమ్మిది నెలల వరకు చెక్‌పవర్ ఇవ్వలేదన్నారు. ఐదేళ్లలో ఒకరికి రేషన్‌కార్డు, పింఛన్ ఇప్పించలేక సర్పంచులను అణచివేశారన్నారు. రాజీనామాలు చేసిన వారిలో మాజీ జెడ్పీటీసీ మేరుగు యాదగిరిగౌడ్, మాజీ ఏఎంసీ చైర్మన్ అంజన్‌రావు, ఆవునూర్, వెంకట్రావుపల్లి, మొర్రాపూర్ సర్పంచులు బద్ది కల్యాణి, లక్ష్మణ్, దేవేందర్, సీనియర్ నాయకులు అన్నమనేని సుధాకర్‌రావు, నారాయణరావు, జంగ రాజు, మహిపాల్‌యాదవ్, మాజీ సర్పంచ్ రామచందర్‌రావు ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



సిరిసిల్లక్రైం: నిత్యం శాంతిభద్రతల పరిరక్షణకు బిజీగా ఉండే పోలీసు అధికారులకు, సిబ్బందికి మధ్య క్రీడలతో స్నేహ వాతావరణం ఏర్పడుతుందని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. జిల్లా పోలీసులకు సిరిసిల్ల పోలీసు ప్రీమియం లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను స్థానిక కళాశాల మైదానంలో సోమవారం ప్రారంభించారు. జిల్లా హెడ్ క్వార్టర్స్ నుంచి 8 బృందాలుగా ఏర్పడి పోటీల్లో పాల్గొన్నట్లు వివరించారు. పోటీలు మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీలు ఉదయ్‌రెడ్డి, నాగేంద్రచారి, సీఐలు రఘుపతి, అనిల్‌కుమార్, శశిధర్‌రెడ్డి కరుణాకర్, కృష్ణకుమార్, ఆర్‌ఐలు మధుకర్, యాదగిరి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నేడు మంత్రి పొన్నం ప్రభాకర్ పర్యటన



సిరిసిల్ల: జిల్లాలో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం పర్యటిస్తారని కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం వెల్లడించారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు ముస్తాబాద్ మండల జెడ్పీటీసీ సభ్యుడు గుండం నర్సయ్య, ఇతర ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఈ సందర్భంగా జరిగే సభలో మంత్రి పాల్గొంటారు. మధ్యాహ్నం 12:30 గంటలకు గంభీరావుపేట మండలం కోళ్లమద్ది గ్రామ పంచాయతీ కార్యాలయ భవనం ప్రారంభం, గంభీరావుపేటలో షాపింగ్‌కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1:20 గంటలకు ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో రైతువేదిక భవనాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 1:45 గంటలకు ఎల్లారెడ్డిపేట మండలం దుమాల జెడ్పీ స్కూల్ కాంపౌండ్ వాల్‌కు శంకుస్థాపన, రైతువేదిక ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2:15 గంటలకు ఎల్లారెడ్డిపేటలో మండల పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరనున్న కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2.15 గంటలకు ఎల్లారెడ్డిపేట మండలం రాగట్లపల్లి ఆర్.వి.ఎస్ గదులను ప్రారంభిస్తారు. సాయంత్రం 4.30 కలెక్టరేట్‌లో జిల్లా ఉన్నతాధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షిస్తారు. సాయంత్రం 6:30 గంటలకు జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో లహరి గార్డెన్స్‌లో నిర్వహించే ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొంటారు.

రూ.40కోట్ల పనులకు అనుమతించాలి



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, కౌన్సిలర్లు

- మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పుకార్లే
- సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి
- బీఆర్‌ఎస్‌లోనే కొనసాగుతాం.. అవిశ్వాసం లేదు
- మున్సిపల్ కౌన్సిలర్లు

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణాభివృద్ధికి గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.40 కోట్ల పనులకు టెండర్లు జరిగాయని, ఆ పనులకు అనుమతులు ఇవ్వాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి కోరారు. జిల్లా కేంద్రం శివారులోని తెలంగాణ భవన్‌లో కౌన్సిలర్లతో కలిసి సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సిరిసిల్లతోపాటు శివారు గ్రామాల అభివృద్ధికి అప్పటి మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ రూ.40 కోట్లు మంజూరు చేయగా.. ప్రస్తుత ప్రభుత్వం ఆ పనులను ఆపేయాలని మౌఖిక ఆదేశాలు ఇచ్చిందని జిందం కళ తెలిపారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సీఎం రేవంత్‌రెడ్డి సిరిసిల్లకు మంజూరైన నిధులతో పనులు జరిగేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. సిరిసిల్ల పట్టణాభివృద్ధికి గత ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో పనులు జరిగేలా.. పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు. సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్‌పై కౌన్సిలర్లు అవిశ్వాసం పెడుతున్నట్లు జరిగిన ప్రచారాన్ని కళాచక్రపాణి, మున్సిపల్ కౌన్సిలర్లు ఖండించారు. సిరిసిల్లలో ఆదివారం నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ సర్వసభ్య సమావేశానికి కొందరు కౌన్సిలర్లు వ్యక్తిగత కారణాలతో గైర్హాజరయ్యారని వివరించారు. దీన్ని ఆసరా చేసుకుని అవిశ్వాసం పెడుతున్నారని అసత్యపు ప్రచారం చేశారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో వారి మార్గదర్శకాల ప్రకారం తామంతా బీఆర్‌ఎస్‌లోనే సంతోషంగా కొనసాగుతున్నట్లు వెల్లడించారు. సిరిసిల్ల మున్సిపల్‌పై అసత్యపు ప్రచారాన్ని మానివేయాలని కౌన్సిలర్లు కోరారు. కౌన్సిలర్లు గుడ్ల శ్రీనివాస్, అన్నారం శ్రీనివాస్, పాతూరి రాజిరెడ్డి, కల్లూరి రాజు, భూక్యా రెడ్డినాయక్, రాపెల్లి అరుణ, కల్లూరి లత, గుండ్లపల్లి నీరజ, గెంట్యాల శ్రీనివాస్, దారుణం అరుణ, అడ్డగట్ల మాధవి, కుడిక్యాల రవికుమార్, దూస వినయ్, లింగంపల్లి సత్యనారాయణ, వేముల రవి, దిడ్డి మాధవి, దార్ల కీర్తన, జాగీరు శైలు, పోచవేని సత్య తదితరులు పాల్గొన్నారు.

భక్తులు ఇబ్బంది పడొద్దు

- అదనపు కలెక్టర్ పూజారి గౌతమి



రాజన్న ఆలయంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ గౌతమి

వేములవాడ: మహాశివరాత్రి జాతర, ప్రస్తుతం కొనసాగుతున్న సమ్మక్క–సారలమ్మ జాతరను పురస్కరించుకొని అశేషంగా తరలివస్తున్న భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ పూజారి గౌతమి ఆదేశించారు. ఆర్డీవో మధుసూదన్, ఈఈ రాజేశ్, డీఈ రఘునందన్, తహసీల్దార్ మహేశ్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్‌లతో కలసి సోమవారం రాజన్న ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. సుదూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రశాంత వాతావరణంలో దర్శించుకునేలా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఆలయ ఆవరణలో పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా ఉండాలని, తాగునీటి సౌకర్యం పెంచాలని, చలవ పందిళ్లు ఏర్పాటు చేయాలని, నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించండి

- అధికారులకు ఆదేశాలు
- అడిషనల్ కలెక్టర్లు గౌతమి, ఖీమ్యానాయక్
- ప్రజావాణికి 39 అర్జీలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అడిషనల్ కలెక్టర్లు గౌతమి, ఖీమ్యానాయక్

సిరిసిల్లటౌన్: సామాన్యులకు సత్వర న్యాయం జరిగేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజావాణికి వచ్చే అన్ని దరఖాస్తులు, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్లు పూజారి గౌతమి, ఖీమ్యానాయక్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వచ్చిన ఒక్క అర్జీ కూడా పెండింగ్‌లో ఉండొద్దని సూచించారు. ఒకవేళ సమస్య పరిష్కారం కాకుంటే ఎందుకు జరగలేదో అర్జీదారునికి లిఖిత పూర్వకంగా అందివ్వాలని సూచించారు. ప్రజావాణి ప్రాధాన్యతపై అధికారులకు మార్గనిర్దేశం చేశారు. దివ్యాంగుడు అర్జీ పెట్టుకోవడానికి రాగా అతని వద్దకు వెళ్లిన అడిషనల్ కలెక్టర్ పూజారి గౌతమి వెంటనే సంక్షేమశాఖ అధికారి లక్ష్మీరాజంకు సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

ప్రజావాణికి 39 దరఖాస్తులు

కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణికి 39 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో రెవెన్యూ 18, ఎంప్లాయిమెంట్ ఆఫీస్ 08, డీపీవో 03, సిరిసిల్ల మున్సిపల్ 02, నర్సింగ్‌కాలేజీ, ఆర్‌అండ్‌బీ, డీడబ్ల్యూవో, డీఈవో, డీఏవో, డిస్ట్రిక్ట్ సర్వేయర్, గంభీరావుపేట, తంగళ్లపల్లి ఎంపీడీవోలకు ఒక్కో దరఖాస్తులు వచ్చాయి. ఆర్డీవోలు ఆనంద్‌కుమార్, మధుసూదన్, జిల్లా అధికారులు, కలెక్టరేట్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

డబుల్‌బెడ్‌రూమ్ సమస్యలు తీర్చాలి



సిరిసిల్ల శివారులోని పెద్దూరు డబుల్‌బెడ్‌రూమ్ కాలనీలో సమస్యలు చాలా ఉన్నాయి. అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో బాధితులు మా కాలనీవాసులే. శ్మశానవాటిక లేక ఇబ్బందులు పడుతున్నాం. చెత్తసేకరణ జరగడం లేదు. – డబుల్‌బెడ్‌రూమ్ వాసులు

గొర్రెల యూనిట్ డీడీ డబ్బులు వాపస్



సిరిసిల్ల: జిల్లాలో రెండో విడత గొర్రెల యూనిట్ల కోసం కట్టిన డీడీల డబ్బులను వారం రోజుల్లో తిరిగి చెల్లించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని యాదవ హక్కుల పోరాట సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కొక్కు దేవేందర్‌యాదవ్ తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్ గౌతమికి ఫిర్యాదు చేయగా.. వారం రోజుల్లో డబ్బులు వాపస్ ఇప్పిస్తామని చెప్పారని వెల్లడించారు. జిల్లా పశువైద్యాధికారి కొమురయ్య ను గొర్రెల కాపరులు తీసిన డీడీల డబ్బులు తిరిగి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారని దేవేందర్‌యాదవ్ వివరించారు. గొర్రెలకాపరులు తీసిన డీడీల జిరాక్స్‌లు, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో గొర్రెలకాపరులు వ్యక్తిగత దరఖాస్తు రాసి ఇస్తే నేరుగా బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ చేయడం జరుగుతుందని డాక్టర్ కొమురయ్య తెలిపారని వివరించారు. జిల్లాలో డీడీలు చెల్లించిన వారు డబ్బుల వాపస్ కోసం వ్యక్తిగతంగా దరఖాస్తులు చేయాలని దేవేందర్‌యాదవ్ కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కడారి రాములు యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఒగ్గు బాలరాజు యాదవ్, నాయకులు పెంజర్ల సత్తయ్య యాదవ్, ముద్దం శ్రీనివాస్ యాదవ్, పయ్యావుల రాజు యాదవ్‌లు పాల్గొన్నారు.

కంటివెలుగు డ్రైవర్స్‌కు బకాయిలివ్వాలి



గతేడాది రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమం కోసం జిల్లాలో మేము వాహనాల డ్రైవర్లుగా పనిచేశాం. ఇది 100 రోజుల ప్రోగ్రాం. మాకు మూడు నెలల డబ్బులు మాత్రమే చెల్లించారు. మిగతా నెల డబ్బులు చెల్లించాలని కోరితే అధికారులు వినిపించుకోవడం లేదు.

– కంటివెలుగు వాహనాల ఓనర్స్, డ్రైవర్స్

భూమి సమంగా రిజిస్ట్రేషన్ చేయించాలి



మాది ముస్తాబాద్ మండలం. ఊరి చివర వ్యసాయ భూమి 2.33 ఎకరాల విస్తీర్ణంలో వారసత్వంగా వచ్చింది. మా ముగ్గురికి సమంగా రావాల్సిన భూమిని తమ్ముడు ఒక్కడే ధరణిలో నమోదు చేయించుకున్నాడు. ఈవిషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తే ఎలాంటి స్పందన లేదు. మాకు న్యాయం చేయాలి.

– సరోజ, తోబుట్టువులు ముస్తాబాద్

సదరం సర్టిఫికెట్ ఇప్పించాలి



గత పదేళ్లుగా నేను అంగవైకల్యంతో బాధపడుతున్నాను. సదరం సర్టిఫికెట్ కోసం జిల్లా ఆస్పత్రిలో క్యాంపునకు హాజరైనా కూడా సర్టిఫికెట్ ఇవ్వలేదు. మీరైనా కనికరించి నాకు సదరం సర్టిఫికెట్ ఇప్పించండి. – జి.తిరుపతిరెడ్డి, ఎల్లారెడ్డిపేట

స్పీడ్ బ్రేకర్స్ వేయించాలి



నందికమాన్ నుంచి వేములవాడకు వెళ్లే మార్గంలో చింతల్‌ఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీ వద్ద వాహనాలు అతివేగంతో పోతున్నాయి. ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. స్పీడ్‌బ్రేకర్స్ వేయించాలి.

– స్వాన్ అసోసియేషన్ సభ్యులు, చింతల్‌ఠాణా

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి రూ.3.36 లక్షల విరాళం


విరాళం అందిస్తున్న శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల బొప్పాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోని విగ్రహాలు, ధ్వజస్తంభం ఏర్పాటుకు గ్రామానికి చెందిన బొమ్మనవేణి పద్మ–శ్రీనివాస్ దంపతులు రూ.3.36 లక్షల విరాళం సోమవారం అందించారు. మహారాష్ట్రలని మాలేగావ్‌లో స్థిరపడ్డ శ్రీనివాస్ దంపతులు ఆలయ అభివృద్ధికి ముందుకొచ్చారు. సర్పంచ్ కొండపురం బాల్‌రెడ్డి, బొమ్మనవేణి శ్రీనివాస్, ముత్యాల బాల్‌రెడ్డి, అల్లాడి ప్రేమ్‌కుమార్, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, వంగల రవీందర్, బొమ్మనవేణి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలు రాజకీయంగా ఎదగాలి

- వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు సూర దేవరాజు


పూజలు చేస్తున్న నాయకులు

ముస్తాబాద్(సిరిసిల్ల): వడ్డెరలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు సూర దేవరాజు కోరారు. మండలంలోని గూడెంలో వడ్డెర నాయకుడు వడ్డె ఓబన్న విగ్రహ నిర్మాణ పనులకు సోమవారం భూమిపూజ చేసి మాట్లాడారు. వడ్డెర, కార్మికుల పోరాట యోధుడు వడ్డె ఓబన్న చరిత్రను గత పాలకులు కనుమరుగు చేశారన్నారు. స్వాతంత్ర్యం కోసం ఓబన్న పోరాటాలు చేసినా చరిత్రలో చోటు కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఓబన్న స్ఫూర్తితో యువత బాగా చదువుకోవాలన్నారు. సర్పంచ్ చిట్నేని సరిత, ఉపసర్పంచ్ శాడ శ్రీనివాస్, ఎంపీటీసీ శ్రీధర్, నియోజకవర్గ ఇన్‌చార్జి దారంగుల ఎల్లయ్య, శ్రీనివాస్‌రావు, వల్లెపు రాజలింగం, సూర రమేశ్, శివరాత్రి ఎల్లయ్య, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన గడ్డం అనూష (27) చికిత్స పొందుతూ మృతిచెందింది. పట్టణ సీఐ నటేశ్ వివరాల ప్రకారం.. జగిత్యాల అన్నపూర్ణ చౌరస్తాకు చెందిన అనూషను నిర్మల్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన గడ్డం హరీశ్‌కు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు. జగిత్యాల పోచమ్మవాడలో నివాసం ఉంటున్నారు. చిన్న కుమారుడు పుట్టినప్పటి నుంచి అనూష కడుపునొప్పితోపాటు అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చూపించినా నయం కాలేదు. మనస్తాపానికి గురై ఈనెల 27న ఉదయం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యాయత్నం చేయగా, కుటుంబ సభ్యులు గమనించి జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. మృతురాలి తల్లి పల్లికొండ విజయ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
HOUSE FOR SALE
House for Sale in Bank Colony, G+1, 4 BHK, Road No.4. Clear title & Perfect Vasthu. Price 1.60 Crs. Negotiable. Cont: 9502346517, 7382849707. [WA-7279]

WANTED
ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్. మీ పేరు, అడ్రస్ కాల్/వాట్సప్ చేయగలరు. 91777 36926. [M-1233768]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933
9951602824




రాజన్నకు భక్తజన జాతర

వేములవాడ: రాజన్నకు సమ్మక్క జాతర భక్తుల రద్దీ పెరిగింది. సోమవారం 50 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. దర్శనానికి సుమారు 5 గంటల సమయం పట్టింది. భక్తుల ద్వారా రూ.60లక్షల వరకు ఆదాయం సమకూరింది. భక్తుల రద్దీ పెరిగిపోవడంతో ఆలయ అధికారులు ఆర్జిత సేవలను రద్దు చేశారు.

సీఎంను టచ్ చేసే దమ్ముందా?

- నువ్వు ఒకటంటే..మేము రెండంటాం
- వస్త్ర పరిశ్రమకు బకాయిలు పెట్టింది నీవేకదా
- ప్రజలు బీఆర్‌ఎస్‌కు ఓట్లేసే పరిస్థితి లేదు
- సిరిసిల్లను డెవలప్ చేయడానికి రెడీగా ఉన్నాం
- కేటీఆర్‌పై ప్రభుత్వ విప్ ఆది ఫైర్


మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్లటౌన్: హద్దు పద్దూ లేకుండా మాట్లాడుతున్నవ్, నీకు సీఎం రేవంత్‌రెడ్డిని టచ్ చేసే దమ్ముందా.. అంటూ ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాజీ మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌పై ఫైర్ అయ్యారు. బీఆర్‌ఎస్ పార్టీ సమావేశాల్లో వారు చేసిన అభివృద్ధిపై చర్చించుకోకుండా.. అధికారం పోయిందని కాంగ్రెస్‌పై, సీఎం రేవంత్‌రెడ్డిపై ఇష్టానుసారంగా నోరు పారేసుకుంటే సహించబోమని హెచ్చరించారు. సిరిసిల్లలోని డీసీసీ ఆఫీసులో సోమవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. రాజన్న సిరిసిల్ల జిల్లాను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. బతుకమ్మచీరలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లు ఇచ్చి.. వాటికి సంబంధించిన నిధులను రూ.400కోట్లకు పైగా బకాయిపెట్టిన కేటీఆర్ నేతన్నలకు అండగా ఉంటామని మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. వేయి ఎలుకలు తిన్న పిల్లి తీర్థయాత్రలకు పోయినట్లుగా కేటీఆర్ వ్యాఖ్యలున్నాయని దుయ్యబట్టారు. మాకు అసెంబ్లీలో 65 సీట్లున్నాయ్.. అయినా ప్రభుత్వం కూలిపోతుందంటూ అప్రజాస్వామిక వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మతి భ్రమించి మాట్లాడితే సహించబోమని.. నువ్వు ఒక్కటంటే...మేము రెండు అంటామన్నారు.


బీఆర్‌ఎస్ కోటలు బీటలు: సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి

బీఆర్‌ఎస్ కోటలు బీటలు వారాయని అందుకే కేటీఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని సిరిసిల్ల కాంగ్రెస్ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి విమర్శించారు. బతుకమ్మ చీరల ఆర్డర్ల బిల్లులకు టోకెన్లు ఇచ్చి నిధులు ఎందుకు మంజూరు చేయలేదని ప్రశ్నించారు. శాసనసభలో మీరు 86 మంది ఉన్నప్పుడే కాంగ్రెస్‌ను ఏమి చేయలేకపోయారని.. ఇప్పుడు ఏం చేస్తారని ఎద్దేవా చేశారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్‌కు గుణపాఠం నేర్పుతారని హెచ్చరించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాశ్, నాగుల సత్యనారాయణగౌడ్, సంగీతం శ్రీనివాస్, వైద్య శివప్రసాద్, సూర దేవరాజు, గడ్డం నర్సయ్య, రాగుల జగన్, కాముని వనిత, వెల్మల స్వరూప, కల్లూరి చందన తదితరులు పాల్గొన్నారు.

బెడిసికొట్టిన అవిశ్వాస వ్యూహం

- చందుర్తి సింగిల్‌విండో చైర్మన్‌పై అవిశ్వాసం రద్దు
- రహస్య ప్రాంతానికి రామన్నపేట డైరెక్టర్
- బలనిరూపణ రద్దు చేయాలని కాంగ్రెస్ డైరెక్టర్ల విన్నపం
- నోటీస్‌లు జారీ చేసిన జిల్లా అధికారి

చందుర్తి(వేములవాడ): చందుర్తి సింగిల్‌విండో చైర్మన్‌పై కాంగ్రెస్ పార్టీకి చెందిన డైరెక్టర్ల అవిశ్వాస వ్యూహ బెడిసికొట్టింది. బలనిరూపణకు జిలాసహకార అధికారి సోమవారం సమయం ఇవ్వగా.. బీఆర్‌ఎస్‌కు చెందిన రామన్నపేట డైరెక్టర్ గుడిసె రమేశ్‌ను ఆ పార్టీ నేతలు రహస్య ప్రాంతానికి తరలించడంతో వారి బలం తగ్గినట్లు అయ్యింది. ఈ విషయాన్ని గ్రహించిన కాంగ్రెస్ నాయకులు వెంటనే జిల్లా అధికారిని కలిసి బల నిరూపణను రద్దు చేయాలని కోరారు. దీంతో జిల్లా సహకార అధికారి డైరెక్టర్‌లు అందరికీ నోటీస్‌లు జారీ చేశారు. చందుర్తి సింగిల్‌విండో చైర్మన్ పదవిపై కాంగ్రెస్ పార్టీ డైరెక్టర్లు కన్నేశారు. ఈమేరకు బీఆర్‌ఎస్‌కు చెందిన సింగిల్ విండో చైర్మన్‌పై ఆ పార్టీ డైరెక్టర్ల మద్దతుతోనే అవిశ్వాసం ప్రకటిస్తూ జిల్లా సహకారసంఘం అధికారికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర సహకార సంఘం కమిషనర్ ఆదేశాలతో సోమవారం బల నిరూపణకు నోటీస్‌లు జారీ చేశారు. బల నిరూపణకు మూడో వంతు డైరెక్టర్ల మద్దతు అవసరం కాగా.. బీఆర్‌ఎస్ డైరెక్టర్ల మద్దతు తమకే ఉందని కాంగ్రెస్ డైరెక్టర్లు భరోసాతో ఉన్నారు. ఈ సమయంలోనే బీఆర్‌ఎస్‌కు చెందిన రామన్నపేట డైరెక్టర్ గుడిసె రమేశ్‌ను ఆ పార్టీ నేతలు మూడు రోజుల క్రితమే రహస్య ప్రాంతానికి తరలించారు. రమేశ్ కోసం మూడు రోజులుగా గాలించినా ఫలితం లేకపోవడంతో అవిశ్వాసాన్ని ప్రకటించిన సభ్యులే బలనిరూపణను రద్దు చేయాలని జిల్లా సహకార సంఘం అధికారిని కోరారు.


NOTICE OF THE DISTRICT COOP.OFFICER: RAJANNA SIRCILLA.

సింగిల్‌విండో డైరెక్టర్లకు జిల్లా సహకార సంఘం అధికారి జారీ చేసిన నోటీసు

అతినమ్మకమే దెబ్బతీసిందా..!

చందుర్తి సింగిల్‌విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్‌పై అసమ్మతితో ఉన్న బీఆర్‌ఎస్ డైరెక్టర్ల మద్దతుతోనే కాంగ్రెస్ డైరెక్టర్లు అవిశ్వాస పత్రాన్ని జిల్లా అధికారికి అందజేశారు. బల నిరూపణలో 9 మంది డైరెక్టర్ల మద్దతు కాంగ్రెస్ పార్టీకి ఉందని భావించిన సింగిల్‌విండో చైర్మన్ శ్రీనివాస్ తన రాజకీయ చతురతతో ఒకే ఒక్క డైరెక్టర్‌ను రహస్య ప్రాంతానికి తరలించారు. దీంతో బలనిరూపణకు కావాల్సిన సంఖ్య బలం లేక కాంగ్రెస్ నాయకుల వ్యూహం బెడిసికొట్టింది. కాంగ్రెస్ పార్టీ నాయకుల అతి నమ్మకంతోనే డైరెక్టర్లను క్యాంపునకు తరలించకపోవడంతోనే భంగపడ్డారని చర్చించుకుంటున్నారు.

కాంగ్రెస్‌ది ప్రజా సంక్షేమ పాలన

- ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్


రిబ్బన్ కట్ చేస్తున్న విప్ లక్ష్మణ్ కుమార్

గొల్లపల్లి(ధర్మపురి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాసంక్షేమ పాలన అందిస్తోందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం గొల్లపల్లి మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఇబ్రాహీంపల్లిలో మన ఊరు – మన బడి కార్యక్రమంలో భాగంగా నూతన పాఠశాలను ప్రారంభించారు. మండల కేంద్రంలో నూతనంగా నిర్మించే మార్కెట్ యార్డు, భీంరాజ్‌పల్లి ఎస్సీ కాలనీలో డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. శ్మశానవాటికను ప్రారంభించారు. రాఘవపట్నం గ్రామానికి చెందిన సురేందర్‌రెడ్డికి రూ.లక్ష ఎల్‌వోసీ అందించారు. అనంతరం లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మూడు గ్యారంటీలను అమలు చేశామని, ఫిబ్రవరిలో మిగిలిన గ్యారంటీలను అమలుచేస్తామని, అన్ని వర్గాలకు న్యాయం చేస్తామని తెలిపారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని, ప్రజలతో కలిసి పనిచేస్తానని అన్నారు. ప్రజలకు తాగునీరు, సాగునీరు వంటి సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు నిశాంత్‌రెడ్డి, జెడ్పీటీసీ జలందర్, ఏఎంసీ చైర్మన్ హన్మండ్లు, సర్పంచులు చిర్ర గంగాధర్, రేవెళ్ల సత్యనారాయణ, ఎంపీటీసీ రవీందర్‌రావు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు తిరుపతి, పట్టణ అధ్యక్షుడు మహేశ్, మాజీ సర్పంచ్ భీమ సంతోష్, ఎంఈవో జమునాదేవి ఉన్నారు.

రాష్ట్ర ధూపదీప నైవేద్య కార్యవర్గ సభ్యుడిగా వేణుగోపాలాచారి


వేణుగోపాలాచారి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని నారాయణపూర్ శ్రీసీతారామాలయ అర్చకుడు బీట్కూరి వేణుగోపాలాచారి రాష్ట్ర ధూపదీప నైవేద్య కార్యవర్గ సభ్యుడిగా ఎంపికయ్యారు. జిల్లా నుంచి రాష్ట్ర కార్యవర్గంలో ఎంపికైన వేణుగోపాలాచారికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. మండల కేంద్రానికి చెందిన వేణుగోపాలాచారి నారాయణపూర్ శ్రీసీతా రామాలయంలో అర్చకుడిగా విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర కార్యవర్గంలో చోటు లభించడంపై నారాయణపూర్ గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

31 వరకు సీసీఐ పత్తి కొనుగోళ్లు

- జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్

సిరిసిల్ల: జిల్లాలో పత్తి కొనుగోళ్లను కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) నిలిపి వేసే అవకాశం ఉందని జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ సోమవారం తెలిపారు. సీసీఐ నిబంధనల మేరకు నాణ్యమైన పత్తి రావడం లేదన్నారు. ఎవరైనా నాణ్యమైన పత్తిని సీసీఐలో అమ్ముకోవాలని భావిస్తే జనవరి 31లోగా జిల్లాలోని ఐదు జిన్నింగ్ మిల్లులకు తేవాలని కోరారు. ఫిబ్రవరి 1 నుంచి సీసీఐ పత్తి కొనుగోళ్లు నిలిపివేసే అవకాశం ఉందని ప్రవీణ్ స్పష్టం చేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఆటోల నుంచి తొలగించిన అదనపు సీట్లు, పరికరాలు

కరీంనగర్‌క్రైం: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఏసీపీ సర్వర్ సూచించారు. సోమవారం కరీంనగర్ కమిషనరేట్ ట్రాఫిక్ పోలీసులు బస్టాండ్ ఇన్ గేట్ వద్ద స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. దాదాపు 100కు పైగా ఆటోల నుంచి అదనంగా పరిమితికి మించి డ్రైవర్ పక్కన ప్రయాణికులు కూర్చునేలా అమర్చిన సీట్లు, మ్యూజిక్ సిస్టం, ఇతర వాహనదారులకు ఇబ్బంది కలిగించేలా అమర్చిన పరికరాలను తొలగించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను చేరవేయరాదని సూచించారు. ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించిన ఆటో డ్రైవర్లను గుర్తించడమే కాకుండా వారికి ఈ చలాన్ ద్వారా జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. ఇక నిరంతరం స్పెషల్‌డ్రైవ్‌లు కొనసాగుతాయని వివరించారు. ఆటో డ్రైవర్లే కాకుండా ఇతర వాహనదారులు కూడా నియమాలు పాటిస్తూ, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, సబ్ ఇన్‌స్పెక్టర్లు రాజు, సాగర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకరిపై పోక్సో కేసు

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని నిమ్మపల్లిలో ఒకరిపై పోక్సో కేసు నమోదయినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. నిమ్మపల్లికి చెందిన మానుక శంకర్(53) అదే గ్రామానికి చెందిన సమీప బంధువు మనవరాలు అయిన బాలిక(12)పై లైంగికదాడికి ప్రయత్నించినట్లు బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో డీఎస్పీ నాగేంద్రచారి, షీటీమ్ ఏఎస్సై ప్రమీల, ఎస్సై ఆంజనేయులు గ్రామంలో విచారణ చేపట్టారు. నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

ఎల్‌ఎండీకి నీటి విడుదల


ఎల్‌ఎండీకి వెళ్తున్న నీరు

బోయినపల్లి(చొప్పదండి): శ్రీ రాజరాజేశ్వర(మిడ్ మానేరు) ప్రాజెక్టు నుంచి ఎల్‌ఎండీకి నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టు ఒక్క గేటు ద్వారా సోమవారం ఎల్‌ఎండీకి 500, కుడికాల్వ ద్వారా 300, ఎడమకాల్వ ద్వారా 10 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులోకి ఎస్సారెస్పీ నుంచి 250 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టులో 15.78 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది.

వరిలో కాండం తొలిచే పురుగు

- రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి
- జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్


భాస్కర్, జిల్లా వ్యవసాయాధికారి

సిరిసిల్ల: జిల్లాలో యాసంగి సీజన్‌లో వేసిన వరిపంటకు కాండం తొలిచే పురుగు సోకుతుందని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ సోమవారం తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 1,52,962 ఎకరాల్లో వరి పంట సాగైనట్లు వివరించారు. ఈ సందర్భంగా రైతులు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. పంటలో పురుగు ఉధృతిని గమనించడానికి దీపపు ఎరను, సోలార్ దీపపు ఎర, లేదా లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలన్నారు. పిలక దశలో ఉన్న వరి పొలాల్లో ఎకరానికి మూడు లింగాకర్షక బుట్టలను పెట్టి, అందులో వారానికి 25 నుంచి 30 పురుగులు పడినప్పుడు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. నారుమడి దశలో ఉన్న రైతులు నారుమడిలోనే కార్బోఫురాన్ 3సీజీ గుళికలను, లేదా 600 గ్రాముల ఫిప్రొనిల్ 0.3జి గుళికలు వేయాలన్నారు. నారుమడి దాటి 15 రోజుల పిలక దశలో ఉన్న వరి పొలంలో తప్పకుండా ఎకరాకు కార్బోఫురాన్ 3సీజీ గుళికలు, లేదా కార్టప్ హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కిలోలు, లేదా క్లోరంట్రానిలిప్రోల్ 4జీ గుళికలు 4 కిలోలు 20 నుంచి 25 కిలోల ఇసుకలో కలిపి బురద పదునులో వేయాలన్నారు. మొగి పురుగు నివారణకు సిఫార్సు చేయని సేంద్రియ గుళికలను యూరియాతో కలిపి వేయడం వలన ఎలాంటి ప్రయోజనం ఉండబోదని రైతులు గుర్తించాలన్నారు. వరి పొట్టదశలో ఉండగా.. రెక్కల పురుగు ఉధృతిని గమనించి కార్టప్ హైడ్రోక్లోరైడ్ 50శాతం ఎస్.పి. 2 గ్రాములు(400 గ్రాములు ఎకరాకు) లేదా ఎకరాకు క్లోరంట్రానిలిప్రోల్ 0.3 మిల్లీలీటర్లు (60 మి.లీ/ఎకరాకు) లేదా ఐసోసైకోలసీరం 0.6 మిల్లీ లీటర్లు(120మి.లీ/ఎకరాకు) లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని జిల్లా వ్యవసాయాధికారి భాస్కర్ సూచించారు.

మెస్ చార్జీల బకాయిలు విడుదల చేయాలి

- గురుకులాలకు భవనాలు నిర్మించాలి
- ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి



సిరిసిల్ల కలెక్టరేట్ ముట్టడించిన విద్యార్థి నాయకులు

సిరిసిల్లటౌన్: పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్లు వెంటనే విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్ కోరారు. కలెక్టరేట్‌ను సోమవారం విద్యార్థులతో కలిసి ముట్టడించిన సందర్భంగా మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా వసతిగృహాలు, గురుకులాలు, కేజీబీవీలు, యూనివర్సిటీలకు గత జూన్ నుంచి డైట్ బిల్లులు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉంటున్న రూ.7,200 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్స్‌కు కాస్మోటిక్, మెస్‌చార్జీలను పెంచాలని కోరారు. అగ్రికల్చర్ యూనివర్సిటీలో హైకోర్టు ఏర్పాటు నిర్ణయంపై ఇచ్చిన జీవో నంబరు 55 వెనక్కి తీసుకోవాలని కోరుతూ కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు మంద అనిల్, ఉపాధ్యక్షుడు జూలపల్లి మనోజ్, గుండెల్లి కళ్యాణ్, కుర్ర రాకేశ్, వేణు, కిరణ్, ఆదిత్య, సంతోష్, అరుణ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ అవినీతి బయట పెడతాం

- వీర్నపల్లి రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు
- మెగా టెక్స్‌టైల్ పార్కును తరలించారు
- బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి గోపి


మాట్లాడుతున్న రెడ్డబోయిన గోపి

సిరిసిల్లటౌన్: ఇన్నేళ్లు అవినీతి పాలన సాగించిన బీఆర్‌ఎస్‌ను ప్రజలు పక్కన కూచోబెట్టింద్రని, ఇక ఆ పార్టీ బండారాన్ని బయట పెడతామని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపి అన్నారు. సిరిసిల్ల ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బండి సంజయ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఏంటని ప్రశ్నించారు. ఎంపీగా వినోద్‌కుమార్ ఏమి చేశారని నిలదీశారు. దత్తత గ్రామం వీర్నపల్లి రోడ్డు ఇప్పటికీ అలాగే ఉందన్నారు. మెగా టెక్స్‌టైల్ పార్కును సిరిసిల్లకు కాదని వరంగల్‌కు తీసుకుపోయింది మీరు కాదా.. అని ప్రశ్నించారు. బండి సంజయ్ చేపట్టిన ప్రగతి నివేదికను పంపిస్తామని చదువుకోవాలని సూచించారు. త్వరలోనే కేటీఆర్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నేతలు చేపట్టిన అవినీతి బండారాన్ని బయట పెడతామని హెచ్చరించారు. రాజాసింగ్, గజభీంకార్ చందు, నాగుల శ్రీనివాస్, శ్రీధర్, విజయ్ తదితరులున్నారు.

ఎల్లారెడ్డిపేట శివాలయంలో చోరీ

- రంగంలోకి దిగిన క్లూస్‌టీం పోలీసులు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఎస్సై రమాకాంత్


శివాలయం వద్ద సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శివాలయంలో ఆదివారం రాత్రి గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. పక్కనే ఉన్న శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో సైతం దొంగతనానికి యత్నించారు. సమాచారం అందుకున్న ఎస్సై రమాకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. క్లూస్‌టీం పోలీసులు వేలిముద్రలు సేకరించారు. ఆలయ కమిటీ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు. దొంగలు మొదట ఆలయం గేటుకు ఉన్న తాళం పగులగొట్టారు. ఆలయ హుండీలోని డబ్బులను ఎత్తుకెళ్లారు. దాని పక్కనే ఉన్న శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలోకి వెళ్లడానికి విఫలయత్నం చేశారు. అప్పటికే రోడ్ల వెంట జనసంచారం ఉండడంతో దొంగలు ఆలయంలోకి వెళ్లకుండానే పరారయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్ ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. కాగా మండల కేంద్రంలో వరుస దొంగతనాలతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. 15 రోజుల క్రితం బైపాస్ రోడ్డులోని వైన్ షాపులో దొంగతనానికి పాల్పడిన ఘటన మరువకముందే శివాలయంలో దొంగలు పడడం చర్చనీయాంశమైంది.

పరిశోధన నైపుణ్యాలు పెంచుకోవాలి



మాట్లాడుతున్న అధ్యాపకులు

కరీంనగర్‌సిటీ: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు పరిశోధన నైపుణ్యాలను పెంచుకోవాలని అగ్రహారం కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేశ్ పేర్కొన్నారు. కరీంనగర్‌లోని ఎస్సారార్ ప్రభుత్వ కళాశాలలో గణితశాస్త్ర విభాగం విద్యార్థులు పలు అంశాలపై పరిశోధన చేసి రూపొందించిన ప్రాజెక్టులను సోమవారం ప్రదర్శించగా, రాజేశ్ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థులు గణితంలో నైపుణ్యాలను పెంపొందించుకొని ఉజ్వల భవిష్యత్తును నిర్మించుకోవాలని కోరారు. డిగ్రీ లెక్చరర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ, గణితశాస్త్ర అధ్యయనంతో సమాజానికి ఉపయోగకరమైన అంశాలు కనుక్కునే అవకాశం ఉంటుందని, ఆ దిశలో విద్యార్థులు ప్రయాణించాలని కోరారు. గణితశాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ వంగల శ్రీనివాస్ మాట్లాడుతూ, కళాశాలలో ఎన్నో వనరులున్నాయని, విద్యార్థులు వినియోగించుకోవాలన్నారు. అనంతరం పీజీ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ టి.రాజయ్య, అధ్యాపకులు డాక్టర్ అర్చన, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ కొమురయ్య, డాక్టర్ పవన్‌కుమార్, తిరుపతి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

నారాయణపూర్‌కు చేరిన 'ఎల్లంపల్లి'


రిజర్వాయర్‌లోకి చేరుతున్న నీరు

గంగాధర(చొప్పదండి): ఎల్లంపల్లి ప్రాజెక్టు నీరు సోమవారం సాయంత్రం మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్‌కు సాయంత్రం చేరింది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని నంది మేడారానికి తరలించి అక్కడి నుంచి పంపింగ్ ద్వారా నారాయణపూర్ రిజర్వాయర్‌కు తరలిస్తారు. ఇక్కడి నుంచి చొప్పదండి నియోజకవర్గంలోని కొడిమ్యాల, గంగాధర, రామడుగు మండలాలతో పాటు, వేములవాడ నియోజకవర్గంలోని చెరువులు, కుంటలకు నీరు చేరుతుంది. కాలువల ద్వారా పంటపొలాలకు నీరు అందిస్తారు. కాగా నందిమేడారం పంప్‌హౌజ్ వద్ద మరమ్మతు పనులు జరుగుతుండగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నాలుగు రోజుల క్రితం పరిశీలించి అధికారులతో మాట్లాడారు. నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని తరలించి పొలాలు ఎండిపోకుండా రైతులను ఆదుకుంటామన్నారు. ఎట్టకేలకు ఎమ్మెల్యే ప్రయత్నం ఫలించింది. ఒక పంప్ ద్వారా నీటి సరఫరా ప్రారంభించారు. నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీరు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.